సాక్షి వరంగల్

సోమవారం | 16 | జూన్ | 2025



ముగిసిన చెస్ పోటీలు

హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–13 బాలబాలికల చెస్ పోటీలు ముగిశాయి. - 8లో▸



కేయూలో ఎన్నికల సందడి..

కాకతీయ యూనివర్సిటీలో ఎస్‌జీఓ, క్లాస్ ఫోర్త్ అసోసియేషన్ల ఎన్నికల సందడి నెలకొంది. ఉద్యోగుల ప్రచారంతో క్యాంపస్ సందడిగా మారుతోంది. - 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. సాయంత్రం సమయంలో అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం



నల్లబెల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని నారక్కపేట, రాంపూర్, మేడపల్లి గ్రామాల్లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసి ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి, వైనాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌కు అవార్డు



వరంగల్ క్రైం: అత్యధిక సంఖ్యలో రక్తదానం చేసేందుకు ప్రోత్సహించినందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌కు ఆదివారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రెడ్‌క్రాస్ అవార్డు ప్రదానం చేశారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రాజ్‌భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీపీ హై బ్లడ్ డోనర్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత



నెక్కొండ: పోగొట్టుకున్న ఫోన్లను రికవరీ చేసి బాధితులకు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం అందించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల నుంచి దరఖాస్తులు తీసుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేశామని చెప్పారు. సీపీఆర్‌ఎస్ ఆదేశాల మేరకు సుమారు లక్ష రూపాయల విలువైన ఫోన్లను గుర్తించి దిలీప్, కట్టయ్య, విజయ్‌పాల్, వినయ్, రాజుకు అందించామని ఎస్సై పేర్కొన్నారు. ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఎస్సై అభినందించారు.

శ్రీరాం అష్టావధానం విజయవంతం



విద్యారణ్యపురి: హనుమకొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు చేపూరి శ్రీరాం 29వ అష్టావధానం విజయవంతంగా పూర్తి చేశారు. ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో కాకతీయ పద్య కవితావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అక్షర తెలుగు అవధానంలో 'తె అక్షర ముష్టికా కథనం' అనే సరికొత్త అంశాన్ని కంది శంకరయ్య ప్రవేశపెట్టగా చేపూరి శ్రీరాం విజయవంతంగా పూరించారు. అంశం అచ్చుల్లో ఉండగా సరైన హల్లులతో పూరించారు. అనంతరం చేపూరి శ్రీరాంను విద్యావికాస పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయ శర్మ, శతావధాని చెన్నూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణప ట్వర్దన్, శతావధాని మురళి అభినందించారు. అవధానంలో సహృదయ సాహితీ అధ్యక్షుడు గిరిజా మనోహర్‌బాబు, దహగం సాంబమూర్తి, విశ్రాంత డీఈఓ నున్నపురాజు రమేశ్వర్ రాజు, అక్కెర కరుణాసాగర్, కొండా యాదగిరి, గుంటి విష్ణుమూర్తి, వెలుగు ప్రభాకర్, సిద్ధంకి బాబు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

నెక్కొండ: పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చంద్రుగొండలోని ఓ ఇంట్లో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో ఆదివారం పోలీసులు దాడులు చేశారని పేర్కొన్నారు. గ్రామానికి చెందిన యాదగిరి, నాగరాజు, సురేశ్, శివకృష్ణ, కుమారస్వామి పేకాడుతుండగా అరెస్టు చేశామని ఎస్సై చెప్పారు. వారి నుంచి రూ.2,070 నగదుతోపాటు నాలుగు సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

పాలనలో తనదైన మార్క్

- ఎంజీఎంలో మెరుగైన వైద్యసేవలకు ప్రత్యేక చొరవ
- మామునూరు విమానాశ్రయం ముందుకెళ్లేలా చర్యలు
- ఫిర్యాదుల పెట్టెలతో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి
- కలెక్టర్‌గా డాక్టర్ సత్యశారద బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది



కలెక్టర్ డాక్టర్ సత్యశారద

సాక్షి, వరంగల్: జిల్లాలో ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలుచేస్తూనే.. ప్రాధాన్యం కలిగిన విద్య, వైద్యంతోపాటు ఉమ్మడి వరంగల్ వాసుల ఏళ్లనాటి కల మామునూరు విమానాశ్రయ పనులు ముందుకు తీసుకెళ్లడంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద తన మార్క్ చూపెడుతున్నారు. కలెక్టర్‌గా ఆమె సోమవారం నాటికి బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తికానుంది. విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు గురుకుల పాఠశాలల్లో 'ఫిర్యాదుల పెట్టెలు' ఏర్పాటు చేశారు. అంతేకాకుండా గురుకులాలను సందర్శించిన సమయంలో ఫిర్యాదుల పెట్టెలను తెరిచి విద్యార్థుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయిలో ప్రశంసలు వచ్చాయి. స్ఫూర్తి కార్యక్రమం ద్వారా పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచారు. అలాగే, గ్రీవెన్స్‌కు వచ్చే సీనియర్ సిటిజన్ల ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన ప్రపంచ అందాల భామల పర్యటన విజయవంతమయ్యేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేశారు. చారిత్రక వరంగల్ ప్రాధాన్యతను ప్రపంచానికి చాటేలా పర్యవేక్షించారు.

ఎంజీఎం ఆస్పత్రికి చికిత్స..

వరంగల్‌కే కాదు ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆస్పత్రికి చికిత్స చేయడంలో కాస్త సఫలమయ్యారు. రోజు వేలాది మంది ఇక్కడికి వైద్య పరీక్షలకు వస్తారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్యశారద తొలి రెండు నెలల్లో పూర్తిస్థాయిలో ఎంజీఎంపై దృష్టిసారించారు. డుమ్మాకొట్టే వైద్యులకు అప్పటి సూపరింటెండెంట్ వి.చంద్రశేఖర్ ద్వారా నోటీసులు కూడా ఇప్పించారు. రోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరించే కొందరు నర్సుల తీరు కూడా మార్చుకోవాలని ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి హెచ్చరించారు. ఇలా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి ఎంజీఎం పాలనలో మార్పు తీసుకొచ్చారు.

నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రిపై ఫోకస్..

రూ.56 కోట్లతో నర్సంపేటలో 220 పడకలతో నిర్మించిన జిల్లా ఆస్పత్రితో పాటు 50 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాలను గతేడాది సెప్టెంబర్‌లో అందుబాటులోకి తీసుకురావడంలో కలెక్టర్ తనదైన ముద్రవేశారు. అంతకుముందే ఈ నిర్మాణ పనులు జరిగినా.. ఆమె వచ్చాక వారానికోసారి ఈ పనులను సమీక్షించారు. గతేడాది సెప్టెంబర్ 19న అందుబాటులోకి తీసుకురావడంలో అందరూ అధికారులను సమన్వయం చేయడంలో విజయవంతమయ్యారు. ఫలితంగా నర్సంపేట నియోజకవర్గవాసులకు కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వైద్యానికి పెద్దగా ఇబ్బంది లేకుండా చేశారు.

ఎయిర్‌పోర్ట్ భూసేకరణకు సర్వే..

ఉమ్మడి వరంగల్ వాసుల ఏళ్లనాటి కల నెరవేర్చే దిశగా కలెక్టర్ అడుగులు వేస్తున్నారు. ఆమె బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే మామునూరు విమానాశ్రయం కోసం అవసరమయ్యే అదనపు 253 ఎకరాల భూసేకరణ సర్వేను పలు దఫాలుగా రెవెన్యూ అధికారులతో చేయించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపిస్తే గతేడాది నవంబర్‌లో నష్ట పరిహారం కోసం రూ.205 కోట్లు మంజూరుకు అనుమతిచ్చింది. అయితే అక్కడి భూనిర్వాసితులతో మూడు దఫాలుగా సమావేశమైన కలెక్టర్ సత్యశారద నేతృత్వంలోని జిల్లా చర్చల కమిటీ తమకున్న విచక్షణాధికారాలతో ఎకరాకు రూ.1,20 కోట్లు చెల్లిస్తామంది. వ్యవసాయేతర భూములకు గజానికి రూ.4,887 చెల్లిస్తామని ఇదే ఫైనల్ అని కలెక్టర్ సత్యశారద తేల్చి చెప్పారు. దీంతో కొందరు రైతులు ఇప్పటికే తమ సమ్మతి తెలిపారు. ఇలా భూనిర్వాసితులను ఒప్పించడంలో ఆమె విజయవంతమయ్యారని కలెక్టరేట్ వర్గాలంటున్నాయి. అలాగే, ఇన్నర్ రింగ్‌రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసితులతో సమీక్షలు చేస్తూ భూసేకరణ కొలిక్కి వచ్చే దిశగా ప్రయత్నిస్తున్నారు.

భూ భారతిపై తనదైన ముద్ర..

కలెక్టర్‌గా రాకముందు సీసీఎల్‌ఏలో పనిచేసిన అనుభవం ఉండడంతో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో చొరవ చూపారు. అయితే, రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి సదస్సుల్లో స్వయంగా పాల్గొని రైతులకు అవగాహన కలిగించారు. రైతులకు ఉన్న సమస్యలపై అక్కడే నివృత్తి చేసే ప్రయత్నం చేశారు. అలాగే, వరంగల్ నగర అభివృద్ధి పనులపై అన్ని విభాగాలతో సమీక్షిస్తూ ముందుకు వెళ్తున్నారు. వరంగల్ బస్టాండ్‌తో పాటు జిల్లా సమీకృత కలెక్టరేట్ పనుల్లో వేగం పెంచాలని ఇప్పటికే అధికారులను పలుమార్లు ఆదేశించారు.

'రోటా'తో రోగాలకు చెక్

- టీకాతో వాంతులు, విరేచనాలు, జ్వరం తదితర వ్యాధుల నివారణ
- శిశువు పుట్టిన 6,10,14 వారాల సమయంలో ఇవ్వాలి
- జిల్లాలో చిన్నారులకు ప్రారంభమైన వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ సాంబశివరావు

గీసుకొండ: పుట్టిన శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు పలు రకాల వ్యాక్సిన్లను తప్పనిసరిగా వేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసింది. వాటిలో రోటా వైరస్ వ్యాక్సిన్ అనేది చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు రక్షణ కవచంగా ఉంటోంది. ముఖ్యంగా చిన్నారులు నీళ్ల విరేచనాలు, వాంతులు (డయేరియా), జ్వరం, కడుపునొప్పి, మూత్ర విసర్జన, బరువు తగ్గడం లాంటి ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటారు. వీటిని నిరోధించడం కోసం రైటా వైరస్ వ్యాక్సిన్ (టీకా) పిల్లలకు వేస్తే సరిపోతుందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా తీవ్రమైన విరేచనాల కారణంగా చిన్నపిల్లల్లో 37 నుంచి 96 శాతం మరణాలు సంభవించే ప్రమాదం ఉంది. వ్యాక్సిన్ వేయిస్తే వాటికి చెక్ పెట్టవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది.

మూడు డోసులుగా వ్యాక్సిన్..

శిశువు పుట్టిన 6,10, 14 వారాలకు ఈ వ్యాక్సిన్‌ను వేస్తారు. 6వ వారం మొదటి, 10వ వారం రెండు, 14వ వారం మూడో డోస్‌ను ఇస్తామని వైద్యులు చెబుతున్నారు. ఇది నోటి ద్వారా ఇచ్చే వ్యాక్సిన్. వ్యాక్సిన్ ప్రతి వాయిల్ (సీసా)లో రెండు డోస్‌లు ఉంటాయి. సీసా మూత తీసిన తర్వాత నాలుగు గంటల్లోపు ఈ వ్యాక్సిన్‌ను ఇద్దరు చిన్నారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతీ వాయిల్‌లో 4 ఎంఎల్ ఉండగా ఇద్దరిలో ఒక్కొక్కరికి 2 ఎంఎల్ ఇస్తారు. నీడిల్ లేని సిరంజి ద్వారా వ్యాక్సిన్‌ను తీసుకుని చిన్నపిల్లలకు నోటి (ఓరల్) ద్వారా ద్రవ రూపంలో ఈ వ్యాక్సిన్‌ను అందిస్తారు. గతంలో ఒక వాయిల్‌లో 2 ఎంఎల్‌గా వ్యాక్సిన్ అందుబాటులో ఉండగా ఒక డోస్‌గా వేసేవారు. ప్రస్తుతం 4 ఎంఎల్ ఉండే వాయిల్‌ను అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఇద్దరు పిల్లలకు 2 ఎంఎల్ చొప్పున వ్యాక్సిన్ వేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండేందుకు..

రోటా వైరస్ అనేది అతిసారం, వాంతులను కలిగించే ఇన్‌ఫెక్షన్. ఇది పేగు వైరస్. చిన్నపిల్లల్లో సులభంగా వ్యాపిస్తుంది. ఈ వైరస్ సోకిన పిల్లలు చాలా వరకు కొన్ని రోజుల్లోనే కోలుకుంటారని, కొందరికి ఇది ప్రాణాంతకంగా మారుతుందని డాక్టర్లు చెబుతున్నారు. ముందస్తుగా ఇలాంటి ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉండడానికి రోటా వైరస్ టీకా వేయించాలని సూచిస్తున్నారు.

అందుబాటులో వ్యాక్సిన్..

జిల్లాలోని ప్రతీ హెల్త్ సబ్‌సెంటర్‌లో వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచినట్లు డిప్యూటీ డీఐఓ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రకాశ్ తెలిపారు. సబ్ సెంటర్లలో ప్రతీ బుధ, శనివారాల్లో పిల్లలకు వ్యాక్సిన్ వేస్తారన్నారు. వరంగల్ మహాత్మా గాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆస్పత్రి, సీకేఎం ఆస్పత్రితోపాటు జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో ప్రతీ రోజు వ్యాక్సిన్ ఇస్తారని ఆయన పేర్కొన్నారు. టీకా వేసే కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు శనివారం ప్రారంభించారు. నగరంలోని దేశాయిపేట అర్బన్ హెల్త్ సెంటర్, గీసుకొండ మండలంలోని కొమ్మాల, సింగ్యాతండాల్లో ఆయన వ్యాక్సిన్ వేసే కేంద్రాలను పరిశీలించారు. వైద్యుల సలహా మేరకు అర్హులైన పిల్లలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

నాటక రంగాన్ని భావితరాలకు అందించాలి

- కేంద్ర ఖాదీ చిన్నపరిశ్రమల మాజీ డైరెక్టర్ ఈగ మలేశం
- ముగిసిన జాతీయస్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



రంగస్థల కళాకారుడు కుసుమ సుధాకర్‌ను సన్మానిస్తున్న ఈగ మల్లేశం

హన్మకొండ కల్చరల్ : నాటక రంగాన్ని భావితరాలకు అందించాలని, కళాకారులను ప్రోత్సహిస్తూ దాతలు సహకరించాలని కేంద్ర ఖాదీ చిన్నపరిశ్రమల మాజీ డైరెక్టర్ ఈగ మల్లేశం అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, రాష్ట్ర చలన చిత్ర, నాటకరంగ అభివృద్ధి సంస్థ హైదరాబాద్ సౌజన్యంతో వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన 16వ జాతీయస్థాయి నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. సాయంత్రం వరంగల్ పోతన విజ్ఞానపీఠం ఆడిటోరియంలో ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈగ మల్లేశం పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి నాటిక పోటీలను ప్రారంభించారు. అతిథులుగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, డాక్టర్ శ్రీరామోజు సుందరమూర్తి, రచయిత వడ్డేపల్లి నర్సింగరావు, వేదిక సలహాదారు పొగాకు రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ఆర్ మూర్తి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారులు కుసుమ సుధాకర్, సాదుల సురేశ్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం హైదరాబాద్ గోవాడ క్రియేషన్స్ వారు అమ్మ చెక్కిన బొమ్మ, కాట్రపాడు ఉషోదయ కళానికేతన్ వారి కిడ్నాప్ నాటిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో రంగస్థల కళాకారులు జేఎస్ శర్మ, బిటవరం శ్రీధరస్వామి, సుధాకర్, విజయరాజ్, జూలూరు నాగరాజు, సంజయ్‌బాబు, ఆకుల సదానందం, ఓడపల్లి చక్రపాణి పాల్గొన్నారు.

భూ కబ్జాదారుల ఆగడాలకు ఒకరి బలి

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి



కుమారస్వామి (ఫైల్)

ఖిలా వరంగల్: భూ కబ్జాదారుల ఆగడాలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మిల్స్‌కాలనీ పోలీసుల కథనం ప్రకారం.. కరీమాబాద్ చెందిన పోలెపాక కుమారస్వామి (55)ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వారసత్వంగా సంక్రమించిన భూమిని అమ్ముకోగా, మిగిలిన 14 గుంటల భూమిని ముగ్గురు బండి కుమారస్వామి, పులి రజనీకాంత్, తాళ్ల మల్లేశం కబ్జా చేసి ప్రహరీ నిర్మించారు. ఆ భూమి తనదేనని పోలెపాక కుమారస్వామి పత్రాలతో వెళ్తే ఎస్సీ, ఎస్టీ పేరుతో దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన కుమారస్వామి ఇటీవల తన భూమి వద్దకు వెళ్లి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. 80 శాతం కాలిన గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం చనిపోయాడు. మృతుడి కుమారుడు రాంకుమార్ ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలకు ముకు'తాడు' పడేనా?



బల్దియా ప్రధాన కార్యాలయ గేట్‌కు కట్టిన తాడు

బల్దియా ప్రధాన కార్యాలయం ఆధునీకరణలో భాగంగా ఆవరణలో గత ఏడాది కిందట గేట్లు ఏర్పాటు చేసి, రంగులు వేశారు. కానీ ఆ గేట్లకు గొళ్లాలు పెట్టడం మరిచిపోయారు. దీంతో కార్యాలయంలోని పరికరాలు దొంగలపాలవుతున్నాయి. చేసేది లేక సెక్యూరిటీ గార్డులు రాత్రి సమయంలో, సెలవు రోజుల్లో గేట్లకు ఇలా తాళ్లు కట్టి ఉంచుతున్నారు. మరి ఈ తాళ్లు దొంగలకు ముకుతాళ్లు వేసేనా అన్నది బల్దియా అధికారులకే తెలియాలి.

\- వరంగల్ అర్బన్

నేడు 'గ్రేటర్' గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ నగరంలో సమస్యల పరిష్కారానికి సోమవారం గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ కమిషనర్ జోనా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాతపూర్వకంగా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్‌ను వినియోగించుకోవాలని కోరారు.

పార్టీలకు 'స్థానిక' జోష్!

- మంత్రి పొంగులేటి ప్రకటనతో పల్లెల్లో మొదలైన ఎన్నికల సందడి
- వారంలో నోటిఫికేషన్ ఉంటుందన్న సంకేతాలు
- నేటి కేబినెట్ మీటింగ్ తర్వాత మరింత స్పష్టత
- ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- ఆతర్వాతే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు
- అధికార పార్టీలో మళ్లీ మొదలైన ఆశావహుల ప్రయత్నాలు
- 'స్థానిక' ఎన్నికలకు రాజకీయ పార్టీల సమాయత్తం



పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు!

సాక్షి ప్రతినిధి, వరంగల్: పల్లెల్లో మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. పొలిటికల్ పార్టీలకు ఎలక్షన్ జోష్ వచ్చింది. వారం, పది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ ఉంటుందన్న మంత్రుల వ్యాఖ్యలు.. ఎన్నికల వేడిని రగిలించాయి. మూడు రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లాలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో 'ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. అత్యధికంగా గెలిచేలా సిద్ధంగా ఉండాలి' అని నాయకులకు మార్గనిర్దేశం చేసిన మంత్రి ధనసరి సీతక్క పరోక్షంగా 'స్థానిక' ఎన్నికల సంకేతాలు ఇచ్చారు. రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏకంగా వారం రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని, ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయని ప్రకటించారు. సోమవారం జరిగే కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని కూడా చెప్పారు. దీంతో అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీలు పోటీకి సమాయత్తం అవుతున్నాయి. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అన్ని పార్టీల ఆశావహులు పోటీ చేసేందుకు మళ్లీ పావులు కదుపుతున్నారు.

మంత్రుల వ్యాఖ్యలు, ఇదే అంశంపై సోమవారం కేబినేట్ కీలక నిర్ణయం తీసుకుంటామనడంతో 'స్థానిక' ఎన్నికల నగారా ఖాయమన్న చర్చ జరుగుతోంది. 2019 ఏప్రిల్ 20న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. మే 6, 10, 14 తేదీల్లో మూడు విడతలుగా పోలింగ్ నిర్వహించారు. 27న ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటించారు. ఈసారి కూడా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండగా.. ఇప్పటికే జిల్లాల వారీగా ఎన్నికల, అధికార యంత్రాంగం ఎప్పుడు నోటిఫికేషన్ వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాలు, బూత్‌లు, ఓటరు లిస్టును సిద్ధం చేశారు. 2019 ఎన్నికల సమయంలో రిజర్వేషన్ల ప్రకారం జెడ్పీ చైర్మన్ పదవులు కేటాయించారు. వరంగల్ అర్బన్ (హనుమకొండ) ఎస్సీ పురుషుడు/మహిళ, వరంగల్ రూరల్ (వరంగల్) జనరల్, జనగామ అన్ రిజర్వుడ్ కోటాలో పురుషుడు/మహిళ, జయశంకర్ భూపాలపల్లి ఎస్సీ మహిళ, ములుగు అన్ రిజర్వుడ్ పురుషుడు /మహిళ, మహబూబాబాద్ ఎస్టీ మహిళకు కేటాయించారు. అలాగే ఎంపీటీసీ, ఎంపీపీలు, సర్పంచ్‌లు కూడా రిజర్వేషన్లు ఇచ్చారు. అయితే ఈసారి నిర్వహించబోయే ఎన్నికల్లో పాత రిజర్వేషన్‌లనే పరిగణనలోకి తీసుకుంటారా? లేక కొత్త నిబంధనలు తీసుకొస్తారా? అనే సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

సర్పంచ్ ఎన్నికలకు సమయం ఉంది..

వాస్తవానికి గతంలో సర్పంచ్ ఎన్నికలు ముందు జరిగి.. తర్వాతే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి. 2019లో పంచాయతీ ఎన్నికలు జనవరిలో జరిగితే, మే, జూన్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీ చైర్మన్ ఎన్నికల తంతు జరిగింది. ఈసారి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలే ముందు జరిపించే అవకాశం ఉందనడంతో సర్పంచ్, వార్డు సభ్యులు, మున్సిపల్ చైర్మన్, సభ్యుల ఎన్నికలకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. 2019లో ఉమ్మడి వరంగల్‌లో మంగపేట మండలం, ఏకగ్రీవమైన 305 పంచాయతీలు మినహా 1,403 గ్రామ పంచాయతీల్లో మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఈసారి కూడా గతేడాది జూలైలోనే అధికారులు పంచాయతీల ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు. 1,705 జీపీల్లో 15,056 వార్డుల్లో 22,45,394 మంది ఓటర్లను గుర్తించిన అధికారులు ఆ మేరకు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వం అప్పుడు ఎన్నికలకు విముఖత వ్యక్తం చేయడంతో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన వెంటనే స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. కాగా.. తాజాగా ఎన్నికల ప్రస్తావన తెర మీదకు రావడంతో అన్ని పార్టీల ఆశావహులతో సందడి మొదలైంది.

2019 ఎన్నికల్లో జిల్లాల వారీగా మొత్తం జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలు

జిల్లా పేరు	జెడ్పీటీసీ స్థానాలు	ఎంపీపీ స్థానాలు	ఎంపీటీసీ స్థానాలు
వరంగల్ అర్బన్	07	07	86
వరంగల్ రూరల్	16	16	178
జేఎస్.భూపాలపల్లి	11	11	106
ములుగు	09	09	72
మహబూబాబాద్	16	16	198
జనగామ	12	12	140
మొత్తం	71	71	780

మల్లన్న ఆలయంలో మిథున సంక్రమణ పూజలు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు: శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం మాస సంక్రమణ పూజలను అర్చకులు నిర్వహించారు. సూర్యుడు సంవత్సర కాలంలో 12 రాశుల్లో పరిభ్రమిస్తుంటాడు. కాగా.. ఆదివారం వృషభరాశి నుంచి మిథునరాశిలోకి ప్రవేశిస్తున్న సందర్భంగా ఆలయంలో మిథున సంక్రమణ పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం మేలుకొలుపు, నిత్య ఆరాధనలు పూర్తయిన తర్వాత మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం, కల్యాణం, ఒగ్గు పూజారులచే పెద్ద పట్నం తదితర కార్యక్రమాలు వేద పండితుల సమక్షంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు.

మేడారంలో భక్తుల సందడి



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క– సారలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పక్క రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర నుంచి భక్తులు భారీగా చేరుకున్నారు. జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కల్యాణ కట్టలో పుట్టు వెంట్రుకలు సమర్పించుకున్నారు. అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, చీరసారె, ఎత్తు బంగారం, ఒడిబియ్యం, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గోవిందరాజు, పగిడిద్దరాజుకు పూజలు చేశారు. సుమారుగా 10 వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రి సీతక్క దృష్టిసారించి భక్తుల కావాల్సిన సౌకర్యాలను దేవాదాయశాఖ అధికారులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పూజారులు కోరారు.

లా సెమిస్టర్ల పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు ఆరో సెమిస్టర్, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు టెన్త్ సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) ఫీజు చెల్లించేందుకు ఈనెల 20 వరకు గడువు ఉందని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆసీం ఇక్బాల్ తెలిపారు. రూ.250 అపరాధ రుసుముతో ఈనెల 23 వరకు ఫీజు చెల్లించుకోవచ్చని వారు పేర్కొన్నారు.

కలెక్టర్ ప్రావీణ్యకు ఆత్మీయ వీడ్కోలు



కలెక్టర్ ప్రావీణ్యను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

కాజీపేట: వరంగల్ జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవంతోపాటు ఈ ప్రాంత పరిచయాలు మరచిపోలేనివని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లో ఆదివారం రాత్రి అన్ని శాఖల అధికారులు సంగారెడ్డి కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న ప్రావీణ్యకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు.. కలెక్టర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి. గణేశ్, ఆర్డీఓలు రమేశ్ రాథోడ్, డాక్టర్ నారాయణ, టీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగన్మోహన్ రావు, జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్ కుమార్, తహసీల్దార్ బావుసింగ్ పాల్గొన్నారు.

ముగిసిన చెస్ పోటీలు

- బాలురలో అభివన్‌రెడ్డి, బాలికల్లో శ్రీలాస్యకు ప్రథమ స్థానం



విజేతలతో టోర్నమెంట్ నిర్వాహకుడు, ఆర్బిటర్లు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–13 బాలబాలికల చెస్ పోటీలు ముగిశాయి. ఉమ్మడి జిల్లా నుంచి 65 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వహణ కార్యదర్శి పి.కన్నా తెలిపారు. బాలుర విభాగంలో అభినవ్‌రెడ్డి ప్రథమ స్థానం, సాయిజోషిత్ బొల్లం ద్వితీయస్థానం, అల్లాడి శ్రీవాట్సన్ తృతీయ స్థానం, శ్రీసాయి ప్రీతం కనకాల నాల్గవ స్థానం సాధించారు. అలాగే, బాలికల విభాగంలో శ్రీలాస్య బోనాల, కంభంపాటి అస్మిత, పెంద్రు సాన్విక, కైరంకొండ సహస్ర వరుస నాలుగు స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. ఈ ఎనిమిది మంది క్రీడాకారులు జూలైలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్బిటర్లు శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. ముగ్గురికి తీవ్రగాయాలు

గూడూరు: ఆటో ద్విచక్రవాహనం, ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా మారిన ఘటన మండలంలోని మానుకోట వైపు దామరవంచ క్రాస్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఏపూరుకు చెందిన బానోత్ తరుణ్, జాటోత్ హేమంత్, ధారావత్ యశ్వంత్ కలిసి ద్విచక్రవాహనంపై మానుకోట వెళ్లారు. తిరుగు ప్రయాణంలో దామరవంచ క్రాస్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన ఓ ఆటో.. ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. 108లో గూడూరులో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రైలు ఢీకొని వృద్ధుడి దుర్మరణం

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌పర్తి రైల్వే యార్డు సమీపంలో రైలు ఢీకొని మతిస్థిమితం లేని వృద్ధుడు ఆదివారం దుర్మరణం చెందాడు. కాజీపేట జీఆర్పీ సీఐ వి.నరేష్‌కుమార్ కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామం వినాయక వీధికి చెందిన కలవచర్ల రాజేంద్రం (76) ఆరు నెలల క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. ఈ క్రమంలో ఆదివారం రైలు పట్టాల వైపు వెళ్లడంతో ఉప్పల్‌రైల్వే స్టేషన్ వైపు వెళ్లే రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు సీఐ వివరించారు.

కళ్లకు కాయలు.. కాళ్లకు బొబ్బలు!



- ఏళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూపులు
- కుప్పలు తెప్పలుగా వినతులు
- పండుటాకులు, దివ్యాంగుల బాధ వర్ణనాతీతం
- సమాచారం లేదంటున్న డీఆర్డీఓ అధికారులు

అడుగుతీసి అడుగేసేంత సత్తువ లేని పండుటాకులు. వేరొకరి సాయం లేకుండా నడవలేని దివ్యాంగులు.. ఇంటి పెద్ద దూరమై కడు దయనీయ పరిస్థితి ఎదుర్కొంటున్న ఒంటరి మహిళలు. కాసింతైనా 'ఆసరా' దొరుకుతుందని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈక్రమంలో వాళ్ల ఎదురుచూపులకు ఫలితంగా కళ్లకు కాయలు కాస్తున్నాయి. కాళ్లకు బొబ్బలెక్కుతున్నాయి. ఎన్ని సార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా.. దరఖాస్తులు సమర్పించినా తమ గోడు ఎవరికీ వినిపించట్లేదని వారంతా ఆవేదన చెందుతున్నారు.

- హన్మకొండ అర్బన్

దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులతో పాటు ఇతర ఎంపిక చేసిన వర్గాలకు ప్రభుత్వం అందజేసే 'ఆసరా' పెన్షన్ మూడేళ్లుగా కొత్తవారికి ఇవ్వట్లేదు. దీంతో వారంతా ప్రభుత్వ పెన్షన్ కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎమ్మెల్యేలను, స్థానిక నాయకులను, అధికారులను కలిసి తమకు పెన్షన్ మంజూరు అందించాలని వేడుకుంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఈవిషయంలో ఉలుకూపలుకు కరువైంది. హనుమకొండ జిల్లాలో 2022 ఆగస్టులో చివరిసారిగా కొత్తగా పెన్షన్లు మంజూరు చేశారు. అప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న వాటిని మంజూరు ఇచ్చిన ప్రభుత్వం మిగతా దరఖాస్తుల విషయం కనీస సమాచారం లేకుండా చేశారు. దీంతో ప్రస్తుతం ఎక్కడ ఎన్ని పెండింగ్ ఉన్నాయి? అనే విషయం కూడా తెలియకుండా పోయింది. మూడేళ్లుగా ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణికి వినతులు అధికసంఖ్యలో వినతులు అందుతున్నాయి. దీనికి తోడు రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వం ఏర్పాటైన సందర్భంగా నిర్వహించిన ప్రజాపాలన వేదిక కార్యక్రమంలో భారీగా పెన్షన్ల కోసం వినతులు వచ్చాయి. వాటిని స్వీకరించిన ప్రభుత్వం డాటా ఎంట్రీ కూడా సక్రమంగా చేయకుండా వదిలేసిందనే ఆరోపణలున్నాయి. పెన్షన్ మొత్తం పెంచుతామన్న ప్రభుత్వం అసలు అర్హులకు పాత లెక్కనైనా పెన్షన్ ఇస్తే బాగుండునని దరఖాస్తుదారులు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో 8,536 మంది..

హనుమకొండ జిల్లాలోని 14 మండలాల పరిధిలో మొత్తం సుమారు 8వేల మందికి పైగా వివిధ కేటగిరీల పెన్షన్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి ప్రభుత్వం పెన్షన్ ఎప్పుడు మంజూరు చేస్తుందో తెలియని పరిస్థితి. వీరంతా దరఖాస్తులు చేసుకుని అధికారులు విచారణ చేసి అర్హులుగా గుర్తించి ప్రభుత్వానికి సిఫార్సు చేయబడినవారే. వీరు కాకుండా పరిశీలన పూర్తి కాకుండా పెండింగ్ దరఖాస్తులు జిల్లా మండల స్థాయిలో కోకొల్లలు. కాగా.. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నవారికి ఎప్పుడు పింఛన్లు వస్తాయనేది జిల్లా అధికారుల వద్ద కూడా సమాచారం లేదని చెబుతున్నారు.

స్పౌజ్ పింఛన్లు మాత్రమే..

జిల్లాలో గత మూడేళ్లుగా కేవలం స్పౌజ్ పింఛన్లు మాత్రమే అధికారులు మంజూరు చేశారు. వృద్ధ దంపతుల్లో భర్త వృద్ధాప్య పింఛన్ పొందుతూ ఉండి మరణించినట్లయితే దాన్ని నిబంధనల ప్రకారం వారి భార్యకు వితంతు పెన్షన్‌గా మార్చారు. ఇలా సుమారు 500 మందికిపైగా ఇచ్చినట్లు అధికారులు తెలిపారు అవి మినహా కొత్తగా.. ఎలాంటి ఆసరా పింఛన్లు మంజూరు ఇవ్వలేదు.

దివ్యాంగుల ఎదురు చూపులు

పింఛన్ల విషయంలో దివ్యాంగుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. వారు వైకల్య నిర్ధారణ కోసం, సదరం సర్టిఫికెట్ కోసం నానా అవస్థలు పడి అది పొంది పెన్షన్ కోసం అర్హత సాధించి దరఖాస్తులు చేసుకుంటే మూడేళ్లయినా.. పెన్షన్ ఇచ్చే దిక్కే లేకుండా పోయిందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల వారు ప్రతీ సోమవారం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. తమ గోడు వినాలని అధికారులను వేడుకుంటున్నారు. తమ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని వారంతా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



ఈ ఫొటోలోని వ్యక్తి రాచర్ల ముత్తయ్య. ఈయనది భీమదేవరపల్లి మండలం వంగర గ్రామం. ఈయనకు ప్రమాదవశాత్తు కాలు విరిగింది. సదరం ధ్రువీకరణ పత్రం పింఛన్ కోసం ఏడాది కాలంగా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తూనే ఉన్నాడు. అయినప్పటికీ అతడి ఆవేదన తీరడం లేదు. పింఛన్ ఎప్పుడు వస్తుందనే దానిపై అధికారులు నుంచి స్పష్టమైన సమాధానం దొరకట్లేదు. దీంతో తమ పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నిస్తున్నారు.

- రాచర్ల ముత్తయ్య

హనుమకొండ జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు ఇలా..

వృద్ధులు	2,462
వితంతువులు	2,717
దివ్యాంగులు	1,616
గీత కార్మికులు	590
చేనేత కార్మికులు	347
బీడీ కార్మికులు	316
ఒంటరి మహిళలు	488

పెండింగ్ దరఖాస్తులు ఇలా..

మండలం	పెండింగ్ దరఖాస్తులు
ఆత్మకూరు	429
భీమదేవరపల్లి	808
దామెర	453
ధర్మసాగర్	477
ఎల్కతుర్తి	676
హసన్‌పర్తి	319
ఐనవోలు	391
కమలాపూర్	611
నడికూడ	508
పరకాల (మున్సిపాలిటీ)	233
పరకాల	230
శాయంపేట	223
వేలేరు	313
వరంగల్ (మున్సిపాలిటీ)	2,865
మొత్తం	8,536

వివాహితను ఇంటినుంచి వెళ్లగొట్టిన కుటుంబీకులు..

- న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట భార్య బైఠాయింపు
- తమ్మడపల్లి గ్రామంలో ఘటన



భర్త ఇంటి ఎదుట కూర్చున్న శ్రావణి

బచ్చన్నపేట: వారు నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. కులాలు వేరుకావడంతో పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్నారు. కొంతకాలంగా అన్యోన్యంగా ఉంటున్న ఆ దంపతుల మధ్య ఇటీవల విభేదాలు తలెత్తాయి. ఇదే అదునుగా భావించిన కుటుంబీకులు ఆ వివాహితను కులం, వరకట్నం పేరుతో ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టారు. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. ఈ ఘటన మండలంలోని తమ్మడపల్లిలో జరిగింది. బాధితురాలు శ్రావణి అలియాస్ నైనిక కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బేజాడి మంజుల, మల్లేశం దంపతుల కుమారుడు కరుణాకర్, అదే గ్రామానికి చెందిన పోగుల విజయలక్ష్మి, నర్సింహులు దంపతుల కూతురు శ్రావణి నాలుగేళ్లుగా ప్రేమించుకున్నారు. కులాలు వేరుకావడంతో పెద్దలను ఎదురించి ఎనిమిది నెలల క్రితం యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నారు. అనంతరం మండలంలోని కొడవటూరులోని సిద్ధేశ్వరాలయ వద్ద మ్యారేజీ సర్టిఫికెట్ తీసుకున్నారు. ఈ క్రమంలో ఆరు నెలలుగా అన్యోన్యంగా ఉన్న దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ విషయమై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి గ్రామ పెద్దమనుషుల సమక్షంలో కూడా మాట్లాడుకున్నారు. ఇంతలోనే మరోసారి కులం, వరకట్నం పేరుతో విడిపోదామని ఒత్తిడి తేవడంతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శ్రావణిని కుటుంబ సభ్యులు ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టారు. దీంతో తనకు న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట బైఠాయించింది. తనకు భర్త కావాలంటూ రోదించింది. కాగా, భర్త కరుణాకర్, కుటుంబ సభ్యులు మాత్రం ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు.

ఆయుర్వేదం మన సంపద

- భారతీయ విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటుదాం
- డీసీపీ రాజమహేంద్ర నాయక్
- ముగిసిన స్టేట్ లెవల్ ఆయుర్వేద కౌశలం–2025 సదస్సు



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీసీపీ రాజమహేంద్ర నాయక్

జనగామ: మన ఆయుర్వేద వైద్యాన్ని భవిష్యత్ తరాలకు అందించడంతోపాటు భారతీయ విజ్ఞానాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని డీసీపీ రాజమహేంద్ర నాయక్ పిలుపునిచ్చారు. జనగామ వేద పంచకర్మ వెల్‌నెస్ సెంటర్, విశ్వ ఆయుర్వేద పరిషత్ తెలంగాణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులుగా జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న స్టేట్ లెవల్ ఆయుర్వేద కౌశలం–2025 సదస్సు ఆదివారం ముగిసింది. వేద డాక్టర్ అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశంలో డీసీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయుర్వేద వైద్యం దేశ సంపద అన్నారు. నిత్య జీవితంలో ఆయుర్వేదాన్ని అనుసరిస్తూ, కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. గౌరవ అతిథి కల్నల్ మాచర్ల భిక్షపతి మాట్లాడుతూ వైజ్ఞానిక విశిష్టత, ప్రాచీన జ్ఞానం ఆధారంగా రోగ నివారణ సామర్థ్యాన్ని విశదీకరించారు. డాక్టర్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేద వైద్యం ముఖ్యమో ప్రత్యక్షంగా తెలుసుకోవాలన్నారు. డాక్టర్ ప్రీతి దయాల్.. పోలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్, హార్మోనల్ అసమతుల్యత గురించి వివరించారు. డాక్టర్ శరద్ కుమార్.. ఆయుర్వేద సిద్ధాంతాలను ప్రస్తుత కాలానికి అనుగుణంగా ఎలా ఉపయోగించాలో అనే అంశంపై అవగాహన కల్పించారు. డెలిగేట్స్ ఐశ్వర్య, ఆదిలక్ష్మి ఆయుర్వేద కౌశలంలో నేర్చుకున్న అనుభవాలను పంచుకున్నారు. వేద ఆయుర్వేద పంచకర్మ వెల్‌నెస్ సెంటర్‌ను చూసిన తర్వాత తాము ఎంతో ప్రేరణ పొందామన్నారు. అనంతరం డీసీపీ చేతుల మీదుగా వైద్య విద్యార్థులు, అతిథులకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఎల్.కె.విరాజిత, సురేశ్ జకోత్యా, పూలే అనిల్, ఆర్య చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకలు ఎంత పని చేసే..

- పల్లెంలో ఉన్న దీపం, పండ్లను ఇంటి చూరులోకి తీసుకెళ్లిన మూషికాలు
- దీపం అంటుకుని దగ్ధమైన ఇల్లు
- రూ. లక్ష వరకు ఆస్తి నష్టం



కాలిన ఇంట్లో బాధితురాలు చంద్రమ్మ

చిల్పూరు: ఎలుకలు ఎంత పని చేశాయి.. పల్లెంలో ఉన్న దీపం, పండ్లను ఇంటి చూరులోకి తీసుకెళ్లాయి. దీంతో దీపం అంటుకుని ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ. లక్ష వరకు ఆస్తి నష్టం జరిగింది. ఈ ప్రమాదం ఆదివారం ఉదయం మండలంలోని కృష్ణాజీగూడెంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామానికి చెందిన సాదం చంద్రమ్మ పెంకుటింట్లో నివాసం ఉంటోంది. రోజు మాదిరి గానే ఉదయం దేవుడికి దీపం పెట్టి బయటకు వెళ్లింది. ఈ క్రమంలో దీపం పళ్లెంలో పండ్లు ఉండడంతో ఎలుకలు వాటిని తీసుకుని ఇంటి చూరులోకి వెళ్లాయి. పంట్లతో పాటు వెలిగించిన దీపం కూడా ఉండడంతో పెంకులు అమర్చిన వెదురు కర్రలకు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు లేచాయి. ఈ ఘటనలో ఇంట్లో ఉన్న రూ. 26 వేల నగదు, బియ్యం, ఇతర వస్తువులు కాలి బూడిద కావడంతో సుమారు రూ. లక్ష ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు లబోదిబోమంది. నిరుపేద చంద్రమ్మను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రెండు బైక్‌లు ఢీ..

- ఒకరి మృతి.. తొర్రూరులో ఘటన



రమేశ్(ఫైల్)

తొర్రూరు: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. తొర్రూరుకు చెందిన సర్వి రమేశ్ (42) తొర్రూరు ఎంఈఓ కార్యాలయంలో సీఆర్పీగా విధులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం రాత్రి తన వ్యక్తి గత పనుల నిమిత్తం తొర్రూరు బస్టాండ్ వద్దకు వెళ్లాడు. అనంతరం ఇంటికి వస్తున్న క్రమంలో అన్నారం రోడ్డుపై జఫర్‌గఢ్ మండలానికి చెందిన జువారి బన్ని తన బైక్‌తో ఎదురుగా ఢీకొన్నాడు. దీంతో రమేశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గమనించి వెంటనే వరంగల్ తరలించారు. పరీక్షించిన వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య సుమలత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

లోక్ అదాలత్‌లో 13,754 కేసులు పరిష్కారం

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 13,754 కేసులు పరిష్కారమైనట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో 991 పరిష్కరం కాగా ఇందులో సెంట్రల్ జోన్ పరిధిలో 455 కేసులు, ఈస్ట్ జోన్‌లో 258, వెస్ట్‌జోన్‌లో 278 కేసులు లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరమైనట్లు తెలిపారు. 5,248 డిజాస్టర్ కేసులు , 4,701 ఈ–పెట్టీ కేసులు, 2,551 మోటార్ వెహికల్ కేసులు పరిష్కరమైనట్లు సీపీ చెప్పారు. సైబర్ నేరాలకు సంబంధించి 263 కేసుల్లో బాధితులకు రూ. 1,06,52,078 నగదు ఇవ్వాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు మరో సైబర్ కేసుల్లో బాధితులకు రూ. 20,81,188 నగదు అందజేశామని సీపీ వివరించారు.

జైళ్ల శాఖ విశ్రాంత ఉద్యోగుల కమిటీ ఎన్నిక



జైళ్లశాఖ విశ్రాంత ఉద్యోగుల నూతన కమిటీ సభ్యులు

కాజీపేట రూరల్ : ఉమ్మడి వరంగల్ జిల్లా జైళ్ల శాఖ విశ్రాంత ఉద్యోగుల కమిటీని ఆదివారం ఎన్నుకున్నట్లు దర్గా కాజీపేటకు చెందిన చర్లపల్లి జైలు రిటైర్డ్ సూపరింటెండెంట్ జి.సమ్మయ్య తెలిపారు. హనుమకొండలో జైళ్లశాఖ విశ్రాంత ఉద్యోగులు సమావేశమై కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా జి.సమ్మయ్య, ప్రెసిడెంట్‌గా సిహెచ్.రాధాకృష్ణ, సెక్రటరీగా ఎన్.సమ్మయ్య, ట్రెజరర్‌గా కె.నర్సయ్య, కార్యదర్శులుగా ఎం.రవీందర్, ఎ.యాదగిరి, టి.ప్రకాశ్, సిహెచ్.గణపతి, మహిళా కార్యదర్శిగా జె.ప్రభావతి, లీగల్ అడ్వైజర్‌గా కె.నర్సింహాస్వామిని ఎన్నుకున్నారు.

బస్టాండ్ షాపుల యజమానులకు కౌన్సెలింగ్

వరంగల్ క్రైం: హనుమకొండ బస్టాండ్, పరిసర ప్రాంతాల షాపుల, లాడ్జిల యజమానులకు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రాత్రి 10.30 గంటల తర్వాత షాపులు నిర్వహించొద్దన్నారు. లాడ్జిలలో ఉండే వ్యక్తుల వివరాలు, ఆధార్, ఫోన్ నంబర్ తీసుకోవాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేయూలో ఎన్నికల సందడి..

- ఎన్‌జీఓ, క్లాస్ ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ల ఎన్నికలు
- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- బరిలో నిలిచిన వారు పోటాపోటీ ప్రచారం
- క్లాస్ ఫోర్త్‌లో ముగ్గురు ఏకగ్రీవం



'క్లాస్‌ఫోర్త్' జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మొగిలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఎన్‌జీఓ, క్లాస్ ఫోర్త్ అసోసియేషన్ల ఎన్నికల సందడి నెలకొంది. ఉద్యోగుల ప్రచారంతో క్యాంపస్ సందడిగా మారుతోంది. బరిలో ఉన్న వారు ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. వివిధ కార్యాలయాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లి తమకు ఓటువేయాలని అభ్యర్థిస్తున్నారు. కాగా, ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఈ నేపథ్యంలో బరిలో ఉన్నవారి వివరాలు ఇలా ఉన్నాయి. కేయూ ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్ష పదవికి బి. నవీన్‌కుమార్, జి. నిరంజన్ పోటీపడుతుండగా వైస్ ప్రెసిడెంట్‌గా ఎండి. యూనస్, పి. భాస్కర్, జనరల్ సెక్రటరీ పదవికి వల్లాల తిరుపతి, సయ్యద్ అక్రం అహ్మద్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (జనరల్)కు ఎ. సతీశ్‌బాబు, బి. రాజు పోటీపడుతున్నారు. జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (ఉమెన్) బి. కృష్ణవేణి, గౌసియాబేగం, సిహెచ్. దేవమ్మ, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (రిక్రియేషన్)జి. మధుకర్, టి. ప్రభాకర్, పి. సుశీల్, ట్రెజరరీగా సిహెచ్. ప్రవీణ్‌కుమార్, టి. దామోదర్ పోటీపడుతున్నారు. విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్‌జీఓ కేటగిరీలోని ఉద్యోగులను కలిసి ఓటువేయాలని అభ్యర్థిస్తున్నారు. అంతేగాకుండా సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ప్రచారం చేసుకుంటున్నారు. 222 మంది ఉద్యోగులు ఓటర్లుగా ఉన్నారు.

క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్..

కాకతీయ యూనివర్సిటీ క్లాస్‌ఫోర్త్ ఎంప్లాయీస్ ఎన్నికల్లో వివిధ పదవులకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో బరిలో నిలిచిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. అధ్యక్ష పదవికి పి. గుమ్మయ్య, ఎండి. నిజాముద్దీన్ పోటీ పడుతున్నారు. జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (జనరల్) ఎండి. వలిపాషా, టి. రాజేశ్వర్, జాయింట్‌సెక్రటరీ ఆర్గనైజేషన్ (రిక్రియేషన్) ఎన్. ఐలయ్య, పి. వేణు, ట్రెజరర్ పదవికి టి. తరుమల్‌శ్రీనివాస్‌సింగ్, పి. రామనాథం పోటీ పడుతున్నారు. 79 మంది ఉద్యోగులు ఓటర్లుగా ఉన్నారు. ఈ రెండు అసోసియేషన్లకు ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ఈనెల 20న 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించనున్నారు.ఈనెల 21న 11గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు. ఈ అసోసియేషన్ల ఎన్నికల ప్రక్రియకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పంజాల శ్రీధర్ వ్యవహరిస్తున్నారు.

ముగ్గురు ఏకగ్రీవం

క్లాస్ ఫోర్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికల్లో జనరల్ సెక్రటరీ పదవికి ఒక్కరే నామినేషన్ వేసిన మొగిలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా అంకూస్, జాయింట్ సెక్రటరీ ఆర్గనైజేషన్ (ఉమెన్) మల్లికాంబ ఒక్కొక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రూ.19.47 లక్షల విలువైన టొబాకో ప్యాకెట్లు పట్టివేత

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.19,47,100 విలువైన టొబాకో ప్యాకెట్లు పట్టుకున్నామని టౌన్ (రూరల్) ఇన్‌చార్జ్ సీఐ పి.సర్వయ్య ఆదివారం తెలిపారు. పట్టణంలోని ఇల్లందు రోడ్డులో గల మురారిశెట్టి ప్రశాంత్‌కు చెందిన ప్రశాంత్ ఎంటర్‌ప్రైజెస్ షాపులో ప్రభుత్వం నిషేధించిన ఆరోగ్యానికి హానికలిగించే టొబాకో ప్యాకెట్లు ఉన్నాయని సమాచారం వచ్చిందన్నారు. దీంతో మహబూబాబాద్ సీసీఎస్, టౌన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రూ.19,47,100 విలువైన జెకె టొబాకో, ఎంసెంటెడ్ టొబాకో గోల్డ్, డీఎస్‌ఎస్ టొబాకో, ఆర్‌ఆర్ టొబాకో, అంబర్, బాబా బ్లాక్ టొబాకో ప్యాకెట్లు, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఇందుకు బాధ్యులైన ప్రశాంత్, వాహన డ్రైవర్ జాటోత్ అశోక్‌పై టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సీసీఎస్ సీఐ హథీరాం, ఎస్సై తాహేర్ బాబా, మహబూబాబాద్ టౌన్ ఇన్‌చార్జ్ సీఐ సర్వయ్య, టౌన్ ఎస్సైలు విజయ్ కుమార్, అలీం హుస్సేన్, సిబ్బందిని ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ అభినందించారు.

ఆటో నుంచి పడి వ్యక్తి మృతి

కాటారం: ఆటోలో ప్రయాణిస్తున్న క్రమంలో ఓ వ్యక్తి కిందపడి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండల కేంద్రం సమీపంలోని మీనాక్షి జిన్నింగ్ మిల్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై–2 శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని వీరాపూర్‌కు చెందిన వేమునూరి పోశిరెడ్డి(57) పని నిమిత్తం మండల కేంద్రానికి బయలుదేరాడు. గంగారం క్రాస్ వద్ద ఆటో ఎక్కి మండల కేంద్రానికి వస్తున్నాడు. ఈ క్రమంలో మీనాక్షి జిన్నింగ్ మిల్లు వద్ద కళ్లు తిరిగి ఆటో నుంచి కింద పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య సత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై–2 శ్రీనివాస్ తెలిపారు.

అనుమతి లేని జలపాతాలకు వెళ్లొద్దు..

- పర్యాటకులకు అటవీశాఖ అధికారుల విజ్ఞప్తి
- ఆయా జలపాతాలపై నిషేధం విధించినట్లు ఫ్లెక్సీల ఏర్పాటు



దూసపాటి లొద్ది జలపాతానికి వెళ్లే దారిలో బారికేడ్లు ఏర్పాటు చేసి కాపలా ఉన్న సిబ్బంది

వాజేడు: పర్యాటకులు అనుమతి లేని జలపాతాలకు వెళ్లొద్దని అటవీశాఖ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. వాజేడు మండలంలోని బొగత జలపాతానికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. ఇక్కడ పర్యాటకులకు రక్షణ చర్యలతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించారు. అయితే వాజేడు మండలంలో మరికొన్ని జలపాతాలు వెలుగులోకి వచ్చాయి. కానీ ఈ జలపాతాలు దూరంగా ఉండడంతో ఇక్కడికి పర్యాటకుల సందర్శనను నిషేధించారు. అయినా కొందరు పర్యాటకులు దొంగచాటున వెళ్తున్నారు. ఆ సమయంలో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ సిబ్బంది అవగాహన కల్పించడంతో పాటు సుదూర ప్రాంతాల్లో ఉన్న అనుమతి లేని జలపాతాలకు వెళ్లొద్దని హెచ్చరిక బోర్డులు (ఫ్లెక్సీలు) ఏర్పాటు చేశారు. దీంతోపాటు అటుగా వెళ్లే రహదారులకు అడ్డుగా కర్రలతో బారికేడ్లు ఏర్పాటు చేసి సిబ్బందిని నియమిస్తున్నారు. వాజేడు మండల పరిధి కృష్ణాపురం సమీపంలోని అడవిలో భామన సిరి, దూలాపురం సమీప గుట్టల్లో మాసన్‌లొద్ది, కొంగాల సమీప గుట్టల్లో దూసపాటి లొద్ది, అరుణాచలపురం సమీప గుట్టల్లో గుండం, మొరుమూరు గుట్టల్లో మరో జలపాతం ఉన్నాయి. వీటి వద్దకు పర్యాటకులు వెళ్లొద్దని వాజేడు రేంజర్ చంద్రమౌళి, దూలాపురం రేంజర్ బాలకృష్ణ తెలిపారు. ఆయా జలపాతాలకు వెళ్లడంపై ఇప్పటికే నిషేధించినట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామని, ఎవరు అతిక్రమించొద్దని వారు కోరారు.

తండ్రీకొడుకుల విగ్రహాలు ఆవిష్కరణ



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తండ్రీకొడుకుల విగ్రహాలను ఆదివారం మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆవిష్కరించారు. మండలంలోని దుబ్బతండాకు చెందిన అజ్మీరా బాల్యాతో పాటు కుమారుడు సాయికుమార్ ఈ నెల 5న ఖమ్మంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విధితమే. వారి జ్ఞాపకార్థం బాల్యా సతీమణి భారతితో పాటు కుటుంబ సభ్యులు దుబ్బతండాలో ఏర్పాటు చేసిన తండ్రీకొడుకుల విగ్రహాలను రెడ్యానాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డోర్నకల్ పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి భిక్షం రెడ్డి, మాజీ ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, నాయకులు రాయల వెంకటేశ్వర్‌రావు, నంజాల మధు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.